సాక్షి
చిత్తూరు
మంగళవారం । 1 । జూలై । 2025



పచ్చ'మేత'
అధికార పార్టీ నేతల బియ్యం దందాను అధికారులు బట్టబయలు చేశారు. 13 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. - 8లో



పంచాయతీరాజ్ వ్యవస్థపై చిన్నచూపు
కూటమి ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థపై చిన్నచూపు చూస్తోందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం ఆరోపించింది. - 8లో



గందరగోళంగా సర్వేయర్ల బదిలీలు
ఉమ్మడి జిల్లాలోని గ్రామ సచివాలయ సర్వేయర్ అసిస్టెంట్ల బదిలీలు సోమవారం గందరగోళంగా సాగాయి. - 8లో

న్యూస్‌రీల్

ఇష్టారాజ్యంగా ఎంఎస్‌కే బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్: సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల (ఎంఎస్‌కే) బదిలీ కౌన్సెలింగ్‌లో అదే గందరగోళం నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు సోమవారం కూడా చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 600 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా.. సాయంత్రం 6 గంటలకు సంగం మందికి మాత్రమే కౌన్సెలింగ్ పూర్తయ్యింది. అయితే కౌన్సెలింగ్ సక్రమంగా నిర్వహించడంలేదని, సిఫార్సులు ఉన్న వాళ్లకు కోరుకున్న ప్రాంతంలో పోస్టింగులు ఇస్తున్నారంటూ పలువురు ఎంఎస్‌కేలు నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు, తిరుపతి ఏఎస్పీ వెంకటాద్రి, ఇతర అధికారులు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. దాదాపు మెజారిటీ ఉద్యోగులు తిరుపతి అర్బన్, చిత్తూరు అర్బన్ ప్రాంతాలనే కోరుకోవడం.. అక్కడ ఖాళీలు లేకపోవడం, కుప్పంలో 50కు పైగా పోస్టులు ఖాళీ ఏర్పడడంతో ఎవర్ని నియమించాలో తెలియక అధికారులు సైతం ఒకింత గందరగోళానికి గురయ్యారు.

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

శాంతిపురం: సీఎం చంద్రబాబునాయుడు రెండు రోజుల పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటించే ప్రాంతాలను సోమవారం ఆయన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. తుమ్మిశి వద్ద హెలీప్యాడ్, తులసినాయనపల్లి వద్ద బహిరంగ సభా వేదిక, మోడల్ స్కూలు, తిమ్మరాజుపల్లితో పాటు కడపల్లి వద్ద సీఎం నివాసాలను సందర్శించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి సీఎం పర్యటన ముగిసే వరకూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. బారికేడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలలో ఎక్కడికక్కడ చేయాల్సిన పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమాల్లో సీఎంవో అధికారులు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీపీవో ప్రభాకర్, ఆర్డీవో శ్రీనివాసులురాజు, అదనపు ఎస్పీ నందకిశోర్, డీఎస్పీలు రాజ్‌నాథ్, సాయినాథ్, ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ శివయ్య పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు కుప్పం రాక

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళ, బుధ వారాల్లో కుప్పంలో పర్యటించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం సాయంత్రం శాంతిపురం మండలం, కడపల్లె వద్ద ఆయన సొంతింటికి చేరుకోనున్నారు. రాత్రి అక్కడే బస చేసి బుధవారం ఉదయం శాంతిపురం మండలం, తిమ్మరాజుపల్లిలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం తుమ్మిశి వద్ద ఉన్న మోడల్ పాఠశాలను సందర్శిస్తారు. మధ్యాహ్నం కుప్పం వంద పడకల ఆస్పత్రిలో టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న డీఎన్‌సీ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం తుమ్మిశి వద్దనున్న హెలీప్యాడ్ వద్దకు చేరుకుని తిరుగుప్రయాణమవుతారు.

'సమగ్ర'ంగా బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్రశిక్ష శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఆ శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఏపీసీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న సీఆర్పీ, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్, కేజీబీవీ సిబ్బందికి రిక్వెస్ట్ బదిలీలు నిర్వహించాలన్నారు. సీనియారిటీ జాబితా ఆధారంగా బదిలీలకు 26 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 17 మంది బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యారన్నారు. ఐదుగురు అన్ విల్లింగ్ ఇవ్వగా, ఇద్దరు గైర్హాజరైనట్లు చెప్పారు. అంతర్ జిల్లా బదిలీలకు ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారని, వారికి రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయంలో బదిలీలు నిర్వహిస్తారన్నారు. సెక్టోరల్ అధికారులు ఇంద్రాణి, శశిధర్, సూపరింటెండెంట్ కుమార్ పాల్గొన్నారు.



బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ



కూటమి సర్కారు దొంగాట ఆడుతూ మామిడి రైతులను నిండా ముంచేసింది. దొంగచాటుగా అధికార పార్టీ నేతల సిఫార్సులకు టోకెన్లు ఇచ్చి సామాన్య రైతులను పక్కన పెట్టేసింది. దీంతో ప్రభుత్వ పెద్దల తీరుపై మామిడి రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న మామిడి చెట్లను నిలువునా నరికేసుకుంటున్నారు. ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చేయకపోవడంతో మామిడి కాయలను రోడ్లపై పారబోస్తున్నారు. ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి క్యూలో వేచి ఉన్నా, కనికరించే నాథుడు కరువయ్యారు. కాయలు అమ్ముకోవడానికి రేయింబవళ్లు నిద్రాహారాలు లేకుండా నిరీక్షించిన రైతులు కడుపు మండి ధర్నాకు దిగుతున్నారు. ఈ పరిణామాల నుంచి రైతులు, ప్రజల దృష్టిని మరల్చడానికి కూటమి నేతలు, ఎల్లో మీడియాతో కలిసి వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు పక్కా స్కెచ్ వేశారు. రెండు రోజులుగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ప్రచారం ప్రారంభించారు.



గుడిపాల మండలం గొల్ల మడుగు వద్ద.. క్యూ కట్టిన మామిడి కాయల వాహనాలు

సర్కారు దొంగాట!

మామిడికి మద్దతు ధర ఇవ్వకుండా కుట్ర

- ఫ్యాక్టరీ యజమానులతో కూటమి నేతల కుమ్మక్కు
- కడుపు మండి.. రైతుల ఆందోళన
- రైతుల దృష్టిని మరల్చేందుకు పెద్దిరెడ్డిపై నిందలు



చిత్తూరు నగరం గంగాసాగరంలో కాయలు దింపుకుంటున్న ఓ ర్యాంపు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గత కొద్ది రోజులుగా మామిడి రైతుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం మొదట్లో మామిడి కిలో రూ.12గా ప్రకటించింది. ఆ తరువాత రూ.8 అని చెప్పింది. ఇంకో రోజు రూ.6 అని, ఆ తరువాత రూ.5 అని ఇష్టానుసారంగా రోజుకొక ధర చెబుతూ రైతులను మభ్యపెడుతూ వస్తోంది. ధర లేకపోతే పోనీ ఏదో ఒక రేటుకు కాయలు విక్రయించేస్తామన్న రైతులకు టోకెన్లు ఇవ్వడం లేదు. దానికి టీడీపీ నేతల సిఫార్సులు కావాలి. దీంతో పండించిన పంటను సకాలంలో అమ్ముకోలేక మామిడిని రోడ్లపై పారబోస్తున్నారు. మరి కొందరు రైతులు మామిడి కాయల లోడ్లను తీసుకొచ్చి ఫ్యాక్టరీల ముందు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. చాలా వరకు కాయలన్నీ ట్రాక్టర్లలోనే కుళ్లిపోతున్నాయి.

తెల్ల కాగితాలపై సంతకాలు

రైతులు పరిస్థితిని అవకాశంగా తీసుకున్న ఫ్యాక్టరీ నిర్వాహకులు తెల్లకాగితాలపై సంతకాలు తీసుకుని కాయలు దించుకుని పంపేస్తున్నారు. ఈ పరిణామాలతో రైతులు ధర్నాలకు దిగుతున్నారు. గంగాధరనెల్లూరు వద్ద ఓ ఫ్యాక్టరీ యజమాని, అధికారులు, కూటమి నేతలు కుమ్మక్కై దొంగచాటుగా వారికి అనుకూలంగా ఉన్న వారి కాయలను మాత్రం దించుకోవడాన్ని మామిడి రైతులు గమనించారు. వారి తీరుని నిరసిస్తూ ఆదివారం రోడ్డుపై వాహనాలతో మెరుపు ధర్నా చేపట్టారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడ్డ కూటమి నేతలు వారి దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీపై బురద జల్లడం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నేతలే కొందరిని రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారంటూ ఎల్లో మీడియాతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

ఇంత దిగజారుడుతనమా?



రైతులను ఆదుకోవాల్సింది పోయి కూటమి ప్రభుత్వం, ఎల్లో మీడియా దిగుజారుడు రాజకీయాలకు దిగడం దారుణం. మామిడి దిగుబడులకు మద్దతు ధర కల్పించలేక, రోజుల తరబడి క్యూలో ఉన్న మామిడిని కొనుగోలు చేయలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఫ్యాక్టరీ యజమానులు, కూటమి నేతలు కుమ్మక్కై మామిడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత కొద్ది రోజులుగా కూటమి ప్రభుత్వ తీరుని గమనిస్తున్న మామిడి రైతులు తిరగబడుతున్నారు. దీని నుంచి రైతుల దృష్టిని మరల్చటానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇంతకన్న దిగజారుడుతనం మరొకటి లేదు, ఉండబోదు.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు

అడుగడుగునా దగా..

- ఒక ట్రాక్టర్ కాయలు ఫ్యాక్టరీల వద్ద అన్‌లోడ్ చేయడానికి 3 రోజుల నుంచి వారం రోజులు సమయం తీసుకుంటున్నారు. అదే కూటమి నేతలు, అధికారులకు తెలిసిన వారి ట్రాక్టర్లు దొంగ చాటుగా ఒక్క రోజులోనే అన్‌లోడింగ్ చేసి పంపేస్తున్నారు.
- ప్రస్తుతం ఒక్కో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద సుమారు 3 కిలోమీటర్ల దూరం మేర మామిడి కాయల ట్రాక్టర్లు క్యూ కట్టి ఉన్నాయి.
- దీని వల్ల ఒక ట్రాక్టర్‌లో 5 టన్నుల కాయలతో వస్తే అన్‌లోడ్ చేసే నాటికి దాదాపు 1.5 టన్ను కాయలు పాడైపోతున్నాయి.
- ఫ్యాక్టరీ యాజమాన్యాలు ట్రాక్టర్ల అన్‌లోడింగ్ కోసం రోజుకు 100 టోకెన్లు ఇస్తామని చెబుతున్నా కేవలం 50 టోకెన్లు మాత్రమే ఇస్తున్నారు.
- అన్‌లోడింగ్ చేసుకుని ఎన్ని టన్నులు దించుకున్నామంటూ రైతులకు బిల్లులు ఇస్తున్నారు. అయితే ఆ బిల్లులో కిలో మామిడి ధర ఎంతో స్పష్టం చేయలేదు.
- దీనిపై రైతుల నుంచి తిరుగుబాటు రాకుండా అంగీకార పత్రంపై రైతు వద్ద నుంచి సంతకం తీసుకుని పంపుతున్నారు.
- దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం తర్వాత ఎంత ధర చెల్లించినా రైతులు ప్రశ్నించే అవకాశం లేదు.
- ఒక ట్రాక్టర్‌కు లోడ్ చేసే మామిడి కాయలు కోయడానికి రైతుకు రూ.4 వేలు ఖర్చు అవుతోంది. బాడుగ (ఐదు రోజులకు) రూ.7 వేలు.
- ఒకవేళ ఐదు రోజుల్లోపు ఫ్యాక్టరీ యాజమాన్యం కాయాలను దించుకోకుంటే, ఐదో రోజు తర్వాత మళ్లీ అదనంగా రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు రైతు అదనంగా బాడుగ చెల్లించాలి.
- టీడీపీ కూటమి నాయకులు సిఫారసు చేసిన రైతుకు చెందిన మామిడి కాయల ట్రాక్టర్లను రాత్రి వేళ ఫ్యాక్టరీలోకి పంపి అన్‌లోడ్ చేసుకుంటున్నారు. సామాన్య రైతులు మాత్రం రోజుల తరబడి రోడ్లపైన వేచి ఉండలేక కొందరు రోడ్డుపైనే కింద పారబోసి వెళ్లిపోతున్నారు.
- ప్రభుత్వం మామిడి కాయలను రైతు నుంచి ఒక కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీలకు ఆదేశించింది. అయితే ఇప్పటివరకు 8 రూపాయల లెక్కన ఎక్కడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం
- ర్యాంపుల వద్ద కిలో మామిడి కేవలం రెండు రూపాయలుగా మాత్రమే నిర్ణయించారు. చేసేది లేక రైతులు రూ.2కే అమ్ముకోవాల్సిన దుస్థితి కలిగింది.



తోతాపురి మామిడి కాయలు

యూడైస్‌లో కచ్చితమైన వివరాలుండాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో యూడైస్ నివేదికలను కచ్చితమైన వివరాలతో నమోదు చేయాలని ఇంటర్మీడియెట్ డీఐఈవో శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌తో మిట్టూరులోని ఆర్‌కే జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను మెగా పేరెంట్స్, టీచర్ సమావేశం రోజును పంపిణీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10న మెగా పీటీఎం సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. మూడు నెలల పాటు చిత్తూరు జిల్లా ఇంటర్మీడియెట్ డీఐఈవోగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన డీఐఈఓ శ్రీనివాసులును ప్రిన్సిపల్స్ దుశ్శాలువతో సత్కరించారు.



డీఐఈఓ శ్రీనివాసులును సత్కరిస్తున్న ప్రిన్సిపాళ్లు

బాబు హామీలు రీ–కాల్!



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి, చిత్రంలో విజయానందరెడ్డి

- 149 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చ లేదు
- ఆ హామీల విలువ రూ.75 వేల కోట్లు
- ప్రతీ గడప మెట్లెక్కి.. అబద్ధపు హామీలను వివరిద్దాం
- చిత్తూరులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

చిత్తూరు అర్బన్: 'చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాకమునుపు ప్రజలపై హామీల వరాలు గుప్పించారు. అప్పటి వరకు సీఎంగా ఉన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో పాటు మరో 143 పథకాలు అమలు చేస్తామని, సూపర్ సిక్స్ పేరిట ఇంకో ఆరు పథకాలు ఇస్తామని ఊదరగొట్టారు. కానీ సీఎం అయ్యాక ఏడాది పాలనలో ఒక్కటీ అమలు చేయలేదు. అందుకే చంద్రబాబునాయుడు ఇచ్చిన అబద్ధపు హామీలను వివరిస్తూ 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో (తప్పుడు హామీలు ప్రజలకు గుర్తు చేయడం)' పేరిట ప్రజల్లో చైతన్యం కల్పిద్దాం..' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మిన ప్రజలు.. కూటమి ప్రభుత్వానికి ఓట్లేసి మోసపోయారన్నారు. ప్రజలకు జరిగిన అన్యాయాన్ని చెబుతూ, ఇదే సమయంలో వైఎస్.జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రజలకు జరిగిన మేలును వివరించడానికి గ్రామాలు, పట్టణాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నడుం బిగించాలన్నారు. సోమవారం చిత్తూరు నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ.విజయానందరెడ్డితో కలిసి ఆయన పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశం నిర్వహించారు. భూమన మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయనంతగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు రూ.2.85 లక్షల కోట్ల సంక్షేమ పథకాలు అందించినట్లు గుర్తు చేశారు. కానీ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, ఆయన కూటమి నేతలు ప్రజలకు మోసపూరిత హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారన్నారు. హామీలు అమలు చేయకపోగా.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను హతమార్చడం, దాడులు చేయడం, విధ్వంసాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. కూటమి బాధ్యతలను గుర్తుచేసినప్పుడల్లా.. డైవర్షన్ పాలిటిక్స్‌తో బాబు తప్పించుకుంటున్నారన్నారు. తల్లికి వందనం కింద 80 లక్షల మంది లబ్ధిదారులకు నిధులు ఎగ్గొట్టారని, 5 లక్షల మంది రేషన్‌కార్డులు తొలగించారని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదని, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి లాంటి పథకాల ఊసే ఎత్తలేదన్నారు. వీటన్నింటినీ ఇంటింటికీ నయవంచన పేరిట వివరిస్తామన్నారు.

మామిడికి మద్దతు ధర ఏదీ?

విజయానందరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై దాడులు చేయడం, తప్పుడు కేసులు బనాయించడం చేస్తున్నారన్నారు. చిత్తూరు చరిత్రలో మామిడి రైతులు పడుతున్న పాట్లు గతంలో ఎన్నడూ లేవన్నారు. మామిడికి కనీస ధరను అందించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఫ్యాక్టరీల వద్ద పర్మిట్లను టీడీపీ నేతల చేతుల్లో పెట్టుకుని బ్లాక్ మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారని ఆరోపించారు. మామిడి రైతుల బాధలు ఆలకించడానికి తమ నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి త్వరలోనే జిల్లాకు రానున్నట్లు చెప్పారు. కూటమి నేతలు ప్రతి ఇంటికీ మంజూరు చేసిన అబద్ధపు బాండ్లను సైతం ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అధికార పార్టీ నేతలు పెడుతున్న తప్పుడు కేసులను వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని, ఏ ఒక్క పార్టీ కార్యకర్త భయపడాల్సిన పనిలేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ చిత్తూరు నగర అధ్యక్షులు కేపీ.శ్రీధర్, హరిణిరెడ్డి, నాయకులు గాయత్రీదేవి, లీనారెడ్డి, ప్రకాష్, జ్ఞాన జగదీష్, ప్రసాద్‌రెడ్డి, విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ స్థలం స్వాధీనం



ఆక్రమణకు గురైన ఆలయ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న ఏసీ చిట్టెమ్మ

ఐరాల: ఆక్రమణకు గురైన శ్రీకృష్ణ భజన మందిరం ఆలయానికి సంబంధించిన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మండలంలోని అగరంపల్లె శ్రీకృష్ణ భజన మందిరం ఆలయానికి సంబంధించిన సర్వే నం .365, 366లో అదే గ్రామానికి చెందిన పీ.దొరస్వామి, పీ.మధు ఆక్రమించుకుని రేకుల షెడ్డు, పెంకుటిళ్లు నిర్మించుకున్నారు. గుంటూరు దేవదాయ, ధర్మాదాయ శాఖ ట్రిబ్యూనల్ వారి ఆదేశాల మేరకు జిల్లా ఏసీ చిట్టెమ్మ, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో ఆక్రమించిన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ లోకేశ్వరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

బంగారుపాళెం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని పాలేరు వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. బెంగళూరు నగరం కేజీ హళ్లి కి చెందిన సెల్వరాజ్ కుమారుడు శ్యామ్ జయకర్(37) ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలో పాలేరు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయశంకర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువతి ఆత్మహత్య

పుంగనూరు(చౌడేపల్లె): తల్లిదండ్రులు దూరమయ్యారని మనస్తాపం చెందిన ఓ యువతి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పట్టణంలోని సుబేదారు వీధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. సుబేదారువీధిలో నివాసం ఉన్న షేక్‌వలిబాషా సుమారు పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అతని భార్య రెండేళ్ల క్రితం మరో వివాహం చేసుకుంది. ఆమె కుమారుడు ఖాజా, కుమార్తె హసీనాతోపాటు మరో చెల్లి నివాసమున్నారు. తండ్రి మృతి చెందడం, తల్లి మరొక వివాహం చేసుకొని దూరమవ్వడంతో హసీనా (19) మనస్తాపానికి గురైంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని యువతి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పచ్చమేత

- బియ్యం అక్రమ రవాణాలో బరితెగించిన టీడీపీ నేతలు
- పీడీఎస్ బియ్యంతో పాటు టీడీపీ నేతల అరెస్ట్
- సుమారు రూ.6 లక్షల విలువ చేసే 13 టన్నుల బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో సీఐ విక్రమ్, పోలీసులు

నగరి : అక్రమ రవాణాకు సిద్ధం చేసి ఉంచుకున్న 13 టన్నుల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన నగరి మున్సిపాలిటీలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ విక్రమ్ కథనం మేరకు.. ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు రేషన్ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం నగరి మున్సిపల్ పరిధి కీళపట్టు వద్ద తిరుత్తణి బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న జోర్ ఎంజాయ్ హోటల్ పక్కన ఖాళీ ప్రదేశంలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కాగా సమాచారం అందింది. సీఐ తన సిబ్బందిని వెంటబెట్టుకుని రెవెన్యూ అధికారులు, వీఆర్వోతో పాటు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ నాలుగు చిన్న వాహనాలు, ఒక ఐచర్‌లో లోడ్ చేసి ఉంచిన 13 టన్నుల బియ్యం, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారి అయిన టీడీపీ నాయకుడు అమృతరాజ్ నాడార్ అలియాస్ టీఆర్‌ఎస్(62), వై.ధనుష్ (19), డీ.బోస్ (20), ఎన్.రోహిత్ (18), వీ.దినేష్ (23), గజేంద్రన్ (20), రాజేష్ అలియాస్ రాజు (25) మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరు నగరి, నారాయణవనం, పుత్తూరు, పిచ్చాటూరు పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యం సేకరించుకుని ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. వీరు ఎక్కడకు పంపుతున్నారు.. ఇందులో ఎవరెవరి పాత్ర ఉందన్న చైన్ లింక్‌ను పూర్తి స్థాయిలో కూపీలాగి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

పట్టుకున్నవి ప్రభుత్వ ముద్రతో సీలు ఉన్న బస్తాలే

పోలీసులు సోమవారం పట్టుకున్న పీడీఎస్ బస్తాలన్నీ ప్రభుత్వ ముద్రతో సీలున్న బస్తాలే కావడంతో గోడౌన్ నుంచి వచ్చాయా.. రేషన్ షాపుల నుంచి వచ్చాయా అనే అంశాలపై కూడా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ నేడు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జూన్ నెలకు సంబంధించిన పింఛన్‌లను జూలై 1వ తేదీన పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని 2,65,722 మంది లబ్ధిదారులకు గాను రూ.113.45 కోట్లు విడుదలైనట్టు ఆయన పేర్కొన్నారు.

3న కృత్రిమ ఉపకరణాల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు కృత్రిమ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని జూలై 3వ తేదీన చిత్తూరులో నిర్వహించనున్నట్లు డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారత ప్రభుత్వ సంస్థ అలింకో సహకారంతో నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర మంత్రి రాందాస్ అథాలేతోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సిఫారసుకే పెద్దపీట



కౌన్సెలింగ్‌కు హాజరైన సచివాలయ ఉద్యోగులు

- మంచి ర్యాంకు ఉన్నా దూరంగానే పోస్టింగ్
- పలుకుబడి లేని ఉద్యోగుల పరిస్థితి దయనీయం
- అధికారుల తీరుపై సచివాలయ ఉద్యోగుల అసహనం
- ముగిసిన కౌన్సెలింగ్



బదిలీ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ ఇంజినీర్ సహాయకుల బదిలీల్లో సిఫారసుకే పెద్దపీట వేశారు. ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యేలు చెప్పిన వారికి చెప్పిన చోటుకు బదిలీ చేశారు. ఏ పలుకుబడీ లేని వారి పరిస్థితి దారుణంగా మారింది. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవన్‌లో సోమవారం రెండో రోజు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ ప్రక్రియ సక్రమంగా జరగలేదని ఉద్యోగులు ఆరోపించారు. ఎమ్మెల్యేల లెటర్లు ఉన్న వారికి ప్రాధాన్య

లెటర్లు ఉన్నవారికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే లెటర్లు ఉన్నవారికే ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. సిఫార్సు ఉన్నవారికి వారు కావాల్సిన స్థానం కోరుకోండి అంటూ అడిగి మరీ వారికి సహకరించారు. మరికొందరి విషయంలో ఎమ్మెల్యేలు నేరుగా ఫోన్లు చేసి పేర్లు సిఫార్సు చేయడం గమనార్హం. పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి ఈఈ రామ్మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అయితే ఏ మాత్రం పలుకుబడి లేని వారికి అడిగిన చోటు కాకుండా ఇష్టం వచ్చిన చోటుకు బదిలీ చేశారు.

మతలబు ఏంటీ?

ఇంజినీర్ సహాయకుల బదిలీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 664 మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఆది, సోమవారాలతో కలిపి మొత్తం 469 మందికి మాత్రమే కౌన్సెలింగ్ చేపట్టారు. మిగిలిన 195 మందికి చేయలేదు. సీఎం కార్యక్రమం ఉండడంతో వీటిని అనధికారికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. హడావిడిగా ఈ ప్రక్రియను ముగించి అధికారులు వెళ్లిపోయారు. మిగిలిన వారికి ఎప్పుడు కౌన్సెలింగ్ నిర్వహిస్తారో అనే విషయం పై స్పష్టత లేదు. సంబంధిత ఎంపీడీఓ కార్యాలయాల్లో కౌన్సెలింగ్ చేపట్టనున్నట్టు సమాచారం.

తనిచ్చారని పేర్కొన్నారు. తమశాఖ పరిధిలో పని చేసే ఉద్యోగులని ఏమాత్రం గౌరవం లేకుండా ఎస్‌ఈ కార్యాలయ సిబ్బంది హేయ్, రేయ్, చెప్పింది చేసి పో అంటూ ఏకవచనంతో మాట్లాడుతూ వారితో అమర్యాదగా ప్రవర్తించారని ఇంజినీరింగ్ సహాయకులు అసహనం వ్యక్తం చేశారు.

ర్యాంకులు పట్టించుకోరు

తాము సాధించిన ర్యాంకుల ఆధారంగా ఉద్యోగాలు ఎలా కేటాయించారో అలాగే బదిలీలు చేపట్టాలని, జాబితాలు సిద్ధం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. అయినా అధికారులు వాటిని పట్టించుకోలేదు. ప్రతిభను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపట్టడానికి ప్రయత్నించడం దారుణమని ఆవేదన చెందుతున్నారు.

సీనియారిటీ జాబితా లేకుండానే

ఏ శాఖలో అయినా సీనియారిటీ జాబితా ప్రదర్శించి దాని ఆధారంగానే బదిలీలు చేస్తారని, అయితే సచివాలయ ఉద్యోగుల విషయంలో అలా ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. సీనియారిటీ జాబితా రూపొందించకుండా ప్రాంతాలను కోరుకోమని, వాటిని ఫారంలో నింపి వెళ్లిపోవాలని సూచించడం నిబంధనలకు విరుద్ధమని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థపై చిన్నచూపు

చిత్తూరు కలెక్టరేట్ : పంచాయతీరాజ్ వ్యవస్థ పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు ఆరోపించారు. ఈ మేరకు ఆ విభాగం నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసే నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి పై కేంద్రం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టం ప్రకారం ఉపాధి పనులు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నిర్వహించాలన్నారు. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం సెక్రటరీ నాగశంకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని సర్పంచ్‌లకు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 16వ ఫైనాన్స్ కమిషన్‌లో కేంద్రం విడుదల చేసిన రూ.1150 కోట్ల నిధులను స్థానిక సంస్థలకు పంపిణీ చేయాలన్నారు. 1,320 పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు ఇచ్చి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలన్నారు. అనంతరం డిమాండ్లను పరిష్కరించాలని డీఆర్‌వో మోహన్‌కుమార్ కు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ సుధాకర్, ఈసీ మెంబర్ వరదారెడ్డి, మాజీ సర్పంచ్ అరుణాచలం, నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

మద్యం రాసిన మరణ శాసనం

మద్యానికి బానిసై.. కుటుంబానికి దూరమై..!

- కన్నీళ్లు మిగుల్చుతున్న ఘటనలు

బంగారుపాళెం: వేళాపాళా లేని మద్యం విక్రయాలు యువతను పెడదారి పట్టిస్తున్నాయి. తాగుడు మానేయయని ఇంట్లో వారు ఒత్తిడి చేస్తే మందుబాబులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. మద్యం రాసిన మరణ శాసనానికి ఇటీవల జిల్లాలో ముగ్గురు బలయ్యారు.

బంగారుపాళెంలో..

పలమనేరు మండలం, జగమర్లకు చెందిన సుధాకర్, అతని భార్య పల్లవి బంగారుపాళెం మండలం, నలగాంపల్లెలో ఓ రైతు మామిడితోటలో కాపలాగా ఉంటున్నారు. ఈ నెల 22వ తేదీ పల్లవి భర్త మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో ప్రశ్నించింది. ఈ విషయమై భార్యాభర్తలు గొడవలు పడ్డారు. మొదట భర్త సుధాకర్ విషం తాగాడు. భార్య పల్లవి భయపడి ఆమె కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ భర్త సుధాకర్ కోలుకున్నాడు. భార్య పల్లవి(23) ఈ నెల 26వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందింది.



ఆత్మహత్య చేసుకున్న పల్లవి



భర్త చేతిలో హత్యకు గురైన ప్రమీల

అతిగా మద్యం సేవించి..

బంగారుపాళెం దళితవాడకు చెందిన వినాయకం అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య దూరమైంది. మే 4వ తేదీ అతిగా మద్యం సేవించి ఓ వైన్ షాప్ వద్దే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఇలాంటి ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటునే ఉన్నాయి.



అతిగా మద్యం సేవించి మృతి చెందిన వినాయకం

పాలసముద్రంలో భార్యను చంపిన భర్త

పులిచర్లకు చెందిన కార్తీక్, ప్రమీల దంపతులు. ఏడాది క్రితం పాలసముద్రం మండలం తిరుమల రాజపురానికి వలస వచ్చారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 27వ తేదీన భర్త కార్తీక్ మద్యం తాగి రావడంతో భార్య ప్రమీల అభ్యంతరం చెప్పడంతో ఇద్దరి మధ్య కొడవ సాగింది. కార్తీక్ తాగిన మత్తులో భార్యను తలపై కట్టెతో కొట్టడంతో ఆమె మృతి చెందింది.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.1.5 లక్షల విలువచేసే 4 ద్విచక్ర వాహనాల స్వాధీనం

నగరి : ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడే అంతర్రాష్ట్ర దొంగ తిరుత్తణికి చెందిన సర్గుణన్(50)ని నగరి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఏకాంబరకుప్పం పరిసర ప్రాంతాల్లో గత మూడు నెలలుగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల వరుస చోరీలపై ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెట్టారు. తమిళనాడు సరిహద్దులో వాహనాల రాకపోకలు రికార్డు అయ్యే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చోరీదారులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఇటీవల ఇద్దరిని అరెస్టు చేయగా సోమవారం మరో అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో మండపం జంక్షన్ వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అతన్ని అదుపులోనికి తీసుకున్నట్టు తెలిపారు. విచారణలో అతను గత కొంత కాలంగా నగరి మున్సిపాలిటీ, ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ వద్ద నాలుగు మోటార్ సైకిళ్లను దొంగలించినట్లు తెలిసిందన్నారు. అతని వద్ద నుంచి రూ.1.5 లక్షల విలువ చేసే 4 మోటార్ సైకిళ్లను రికవరీ చేసినట్టు చెప్పారు. ముద్దాయిపై గతంలో తిరుత్తణి రైల్వే పోలీసు స్టేషన్‌లో కేసు ఉన్నట్లు తెలిపారు. ముద్దాయిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బంది సురేష్, సత్య, గజేంద్ర, అశోక్, లోకనాథం, రమేష్‌ను అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ

గుట్టను సందర్శించిన ఫారెస్ట్ సిబ్బంది



నెమలి కలేబరాన్ని పూడ్చిపెడుతున్న అధికారులు

చౌడేపల్లె: మండలంలోని పెద్దయల్లకుంట్ల గుట్టతో పాటు పక్కనే ఉన్న మామిడితోటను సోమవారం ఫారెస్ట్ సిబ్బంది యువరాజు, ప్రభాకర్ సందర్శించారు. 'సాక్షి'లో చిరుతపులి దాడిలో నెమలి మృతి? శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఘటనా స్థలాన్ని మామిడితోట రైతు కడియాల మహేష్ బాబుతో కలిసి పరిశీలించారు. నెమళ్ల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతిచెందిన నెమలి కలేబరాన్ని పొలంలోనే పూడ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పుత్తూరు: స్థానిక మరాఠిగేట్ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణపాలయ్యాడు. పోలీసుల కథనం.. పుత్తూరు మండలం, ఎగువ కనకంపాళెం గ్రామానికి చెందిన వీ.సుబ్రమణ్యంనాయుడు(53) తన కుమారుడు సాయిభార్గవ్(31)తో కలిసి స్కూటర్‌పై పుత్తూరుకు వస్తుండగా చెన్నై నుంచి తిరుపతి డీమార్టుకు వెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి ఢీకొట్టింది. సుబ్రమణ్యంనాయుడు అక్కడికక్కడే మృతి చెందగా సాయిభార్గవ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

పుత్తూరు: స్థానిక రైల్వే స్టేషన్ ముందు ఓ మహిళ సోమవారం సాయంత్రం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. నగరి మండలం, ఏకాంబరకుప్పం గ్రామానికి చెందిన పి.కె.రాణి (65) తాను ఎక్కాల్సిన ట్రైన్ వచ్చేసిందని హడావుడిగా పరుగెడుతూ వచ్చి రైల్వే స్టేషన్ ముందు పడిపోయింది. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

యాచకుడి మృతి

స్థానిక వెంకటేశ్వర హాస్పిటల్ సమీపంలో ఓ యాచకుడు మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడు యాచకుడుగా ధ్రువీకరించిన పోలీసులు స్థానిక మున్సిపాలిటీ సిబ్బందికి మృతదేహాన్ని అప్పగించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

గంగవరం: అనారోగ్యంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గంగవరం సమీపంలోని పారిశ్రామిక వాడకు చెందిన సంతోష్‌కుమార్ భార్య సుజాత(38) ఇంట్లోనే టైలరింగ్ చేసుకుంటోంది. ఆమె భర్త పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ మధ్య కొంత అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రిలో చికిత్స చేసుకునే స్తోమత లేక తీవ్ర మనస్తాపానకి గురైంది. ఈ మేరకు ఆమె సోమవారం మిద్దెపైన ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కేసు దర్యాప్తులో ఉంది.

గందరగోళంగా సర్వేయర్ల బదిలీలు

- ముడుపులు తీసుకుని బదిలీలు చేశారని వెల్లువెత్తిన ఆరోపణలు
- తప్పిదాల కారణంగా రెండు గంటల పాటు ఆగిన కౌన్సెలింగ్



మధ్యాహ్నం కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో లేచి వెళ్లిపోతున్న సర్వే అసిస్టెంట్లు

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామ సచివాలయ సర్వేయర్ అసిస్టెంట్ల బదిలీలు గందరగోళంగా నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సర్వే అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించారు. చిత్తూరు సర్వే శాఖ ఏడీ జయరాజ్ ఆధ్వర్యంలో సర్వే అసిస్టెంట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి సర్వేశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి గందరగోళంగానే సాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 398 సర్వేయర్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. చాలా మందికి అన్యాయం జరగడంతో కలెక్టరేట్ భవనంలో అరుపులు.. కేకలు వినిపించాయి. న్యాయం చేయాలంటూ పలువురు డిమాండ్ చేశారు. మధ్యాహ్నం దాదాపు రెండు గంటలపాటు కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేశారు.

ముడుపుల ఆరోపణలు

సర్వే అసిస్టెంట్ల బదిలీల్లో పలవురుకి అనుకూలమైన స్థానాలను కేటాయించేందుకు సర్వే శాఖ అధికారులు ముడుపులు స్వీకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో పోస్టింగ్ నిమిత్తం ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల వరకు స్వీకరించారని కౌన్సెలింగ్‌కు విచ్చేసిన సర్వే అసిస్టెంట్లు ఆరోపించారు. జిల్లాల పునర్విభజన కారణంగా ఆయా జిల్లాల సర్వే అసిస్టెంట్లకు ప్రత్యేకంగా బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలి. అయితే సర్వే శాఖ అధికారులు అలా చేయకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్వే అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను ప్రదర్శించి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. దీంతో చిత్తూరు జిల్లా నుంచి దాదాపు 120 మంది తిరుపతి జిల్లాకు బదిలీ అయినట్టు సమాచారం. తిరుపతి జిల్లాలో పని చేస్తున్న సర్వే అసిస్టెంట్లు చిత్తూరు జిల్లాకు బదిలీ కావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్ పరిశీలించి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

సీనియారిటీ జాబితాలో అవకతవకలు

సీనియారిటీ జాబితాను పకడ్బందీగా సిద్ధం చేసుకోవాల్సిన సర్వే శాఖ అలసత్వం వహించింది. ఆ జాబితా రూపకల్పనలో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఒకే ర్యాంక్‌ను ఇద్దరు సర్వేయర్లకు కేటాయించారు. అలా ఎలా కేటాయిస్తారని సర్వే అసిస్టెంట్లు అధికారులను ప్రశ్నించారు. కనీసం జాబితా ప్రచురించకుండా కౌన్సెలింగ్ నిర్వహించారని ఆరోపించారు. ఈ తప్పిదాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సెలింగ్ మధ్యాహ్నం 1.30 గంటలకు నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీ ప్రకటించారు. సీనియారిటీ జాబితాలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని స్వయంగా ఏడీనే ప్రకటించారు. దీంతో రెండు గంటల పాటు కౌన్సెలింగ్ ప్రక్రియను ఆపేశారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.45 గంటలకు ప్రక్రియను తిరిగి ప్రారంభించారు. పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించేటప్పుడు సీనియారిటీ, ఖాళీల జాబితాలను ఎందుకు ప్రదర్శించలేదని సర్వే అసిస్టెంట్లు ప్రశ్నిస్తున్నారు.